ఎత్తు వేస్తే ప్రత్యర్థి చిత్తే..

- చదరంగంలో రాణిస్తున్న చిన్నారులు
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: చదరంగం పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపుతున్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపికవుతున్నారు. రాజమహేంద్రవరంలోని హర్షవర్ధన్ పబ్లిక్ స్కూల్లో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయి చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్– 13 బాలబాలికల విభాగంలో వీటిని నిర్వహించారు. బాలుర విభాగంలో ఐదు రౌండ్లు, బాలికల విభాగంలో నాలుగు రౌండ్‌లలో జరిగిన పోటీల్లో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ – 13 విభాగంలో విజేతలుగా నిలిచిన ఇద్దరు బాలురు విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన ఇద్దరు త్వరలో ఏలూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నారు.

మానసిక ఒత్తిడి దూరం

చదరంగం ఆడటం వల్ల జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు, మెదడు మరింత చురుకుగా పనిచేస్తుంది. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుల కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమై, సమస్యను అధిగమించే పోటీతత్వం ఏర్పడుతుందని చదరంగం క్రీడా నిపుణులు చెబుతున్నారు. ఐక్యూ, పెరడగంతో పాటు, అతిగా మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం ఒక మంచి ఔషధంగా పనిచేస్తుంది. పిల్లలో సృజనాత్మక పెరగడంతో పాటు వారి మానసిక ఉల్లాసం చేకూర్చుతుంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

చదరంగం పోటీల్లో జిల్లా స్థాయి అండర్ – 13 విభాగంలో ఎం.భార్గవ సుషాంత్ సాకేత్, జి.హరి చరణ్‌లు విజేతలుగా నిలిచారు. అండర్ –13 బాలికల విభాగంలో వై.నిఖిల, అల్లూరి నేహశ్రీ విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ప్రత్యేక పోటీలు

బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకే చెస్ అకాడమీ పర్యవేక్షణలో ఆదివారం అండర్ – 15 విభాగంలో ది రాజమండ్రి ఐరన్ పెయింట్స్ మర్చంట్ అసోసియేషన్ హాలులో చదరంగం పోటీలు నిర్వహించబోతున్నారు. బాలురు, బాలికలకు అండర్ –7, 9, 11, 13 విభాగాల్లో పోటీలు నిర్వహించి, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేయనున్నారు.



చదరంగం ఆడుతున్న బాలికలు

గర్వకారణం



జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాటు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. ఆలోచనా శక్తిని పెంచుకునేందుకు చదరంగం ఎంతో ఉపయోగపడుతుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు చిన్నారులు, యువత ఆటలోని మెలకువలు నేర్చుకుంటున్నారు. మంచి శిక్షణతో పాటు ప్రతిభ ఉంటే చదరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు.

– జీవీ కుమార్,
జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న ఎంపీ భరత్ రామ్

సీటీఆర్ఐ: స్థానిక 48వ డివిజన్ బర్మా కాలనీ సారంగధర మెట్ట వద్ద విఘ్నేశ్వర కోదండ రామ సుబ్రహ్మణ్య సాయి ఆలయ పునర్నిర్మాణాకి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అజ్జరపు వాసు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు వర్క్‌షాప్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలపై సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎనిమిది రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఏబీ వరప్రసాదరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో జరుగుతున్న రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, సీతానగరం మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వర్క్‌షాప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను త్వరితగతిన నిర్మించడంతో పాటు అంచనాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈలు ఏ.రవి, ఏవీ సూర్యనారాయణ, ఏఈఈలు సంపత్ కుమార్, ప్రసాద్, జేఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కడియం: జేగురుపాడు సెంటర్‌లోని విజయ దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, భక్తులకు భోజనం వడ్డించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఆలయ ధర్మకర్త బూడిగ గణపతి, కంటిపూడి అమర్నాథ్, బూడిగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల మోకాలికి ఆపరేషన్ చేయించుకున్న పిడింగొయ్యి బాపూజీ నగర్ మసీదు ఇమామ్ ఆలీషాను శుక్రవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏ అవసరం వచ్చినా వెంటనే తనకు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్, హుకుంపేట సొసైటీ చైర్ పర్సన్ బొప్పన సుబ్బారావు, పసలపూడి శ్రీనివాసరావు, పడాల వీర రాఘవరెడ్డి, శిరసపల్లి శంకర్, షేక్ మీరావలీ పాల్గొన్నారు.

డీఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు

కంబాలచెరువు: నివ్య ఒకేషనల్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్ శుక్రవారం తెలిపారు. నివ్య పారా మెడికల్ కళాశాలలో 2023, 24 విద్యా సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన రెండేళ్ల డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ) కోర్సుకు గుర్తింపు లభించిందన్నారు. ఇంటర్ పూర్తయిన అన్ని గ్రూపుల విద్యార్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 98853 68855 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు: జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ తొమ్మిదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, ఆ సంస్థల న్యాయవాదులతో సమావేశమయ్యారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థలు, యాక్సిడెంట్ కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు.

ఆటో, మోటార్ సైకిళ్లను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు
- బొమ్మూరు జేఎల్‌బీ నగర్ వద్ద ఘటన



భాస్కరరావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై బొమ్మూరు జేఎల్‌బీ నగర్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఓ ఆటోను, రెండు మోటారు సైకిళ్లను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు గాయాల పాలవ్వగా, ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన గూటం భాస్కరరావు (58), అతడి కుమారుడు శ్రీనివాసరావు మోటారు సైకిల్‌పై ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు రాజమహేంద్రవరం వస్తున్నారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ నుంచి బొమ్మూరు సెంటర్‌కు వచ్చే సమయంలో జేఎల్‌బీనగర్ వద్ద ఒక కారు వేగంగా ఆటోను, గూటం శ్రీనివాసరావు బైక్‌ను, ముగ్గురితో వెళుతున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై వెళుతున్న గూటం భాస్కరరావు, శ్రీనివాసరావు, మరో బైక్‌పై వెళుతున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వీరందరిని 108లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గూటం భాస్కరరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా



వేమగిరిలో మందులు పంపిణీ చేస్తున్న రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, చిత్రంలో డాక్టర్ పద్మలత



13వ డివిజన్ యూహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- సురక్ష శిబిరంలో పలువురికి వైద్యసేవలు

కడియం: పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా కల్పిస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. వేమగిరితోట సచివాలయం –4 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేమగిరితోటలో రూ. 40 లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తున్నామని, దీపావళి లోపు ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే శిబిరానికి వచ్చిన ప్రజలకు ఆయన భోజన సదుపాయం కల్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత మాట్లాడుతూ ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్పెషలిస్టు వైద్యులు వెంకటేష్, రవీంద్ర, పీహెచ్‌సీ వైద్యులు నాగసాయిమౌర్య, స్వరూప తదితరులు 634 మందికి వైద్యసేవలు అందించారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించి 8 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి, సచివాలయం కన్వీనర్లు గుబ్బల నాగార్జున, కట్టా జమీందర్, కట్టా శ్రీధర్, పితాని హరికృష్ణ, యనమదల మణికంఠ, ఎన్.శ్రీను, పి.శ్రీను పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై శ్రద్ధ

ధవళేశ్వరం: పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరం సచివాలయం 2కు సంబంధించి ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పేదల ఇంటికి వైద్యాన్ని చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వివిధ విభాగాల వైద్య నిపుణులతో పాటు ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, వైద్యులు జెస్సీ, లిడియా వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 619 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 20 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనుసూరి పద్మలత, సచివాలయం 2 కన్వీనర్లు తలారి వరప్రసాద్, పేర్ల దుర్గాప్రసాద్, పసుపులేటి దేవి, హమీద్ బాషా, షబ్బర్ బాషా, దేవులపల్లి సరితారాణి, మెండా రాజేష్, చప్పిడి జ్యోతి, బద్రి సుబ్బారావు, బద్రి కామేశ్వరరావు, పట్టపగలు వెంకటలక్ష్మి, కల్యాణి రెడ్డి, కొత్తపల్లి శివ, సత్యం వెంకటరమణ, గునిపే అశోక్, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, తహసీల్దార్ పి. చిన్నారావు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ సేవలు

కంబాలచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. 13వ డివిజన్‌లోని యూహెచ్‌సీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. దీనికి సుమారు 150 మందికి పైగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ వృత్తి రీత్యా డాక్టర్ కావడంతో ఆయనతో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు స్థానికులు క్యూ కట్టారు. దీనిలో భాగంగా ఆయన ఓపీ చూసిన అనంతరం పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి సెలైన్ పెట్టాలని, మరికొందరికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, దీర్ఘకాలిక రోగులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో అద్భుత విజయాలు

- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు
- కంబాలచెరువు పార్కు సందర్శన



కంబాలచెరువు పార్కులో పర్యటిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: అంకిత భావంతో పని చేస్తే, ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించవచ్చని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని కంబాల చెరువు పార్కు, పుష్కర్ ప్లాజాలను ఎంపీ మార్గాని భరత్ రామ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ పరిస్థితులను పరిశీలిస్తున్నానని, త్వరలో రాజకీయాల్లోకి అడుగు పెడతానన్నారు. రాజమహేంద్రవరాన్ని ఎంపీ భరత్ రామ్ చక్కగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. భారత్ క్రికెట్ జట్టు చాలా బాగా ఆడుతోందని, అదే ఒరవడి కొనసాగిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. యువత క్రీడారంగంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 2034లో ఒలింపిక్స్‌కు మన దేశం ఆతిథ్యం ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నారన్నారు. అప్పటికి మన రాష్ట్రం నుంచి అద్భుత క్రీడాకారులు తయారు కావాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ప్రణాళిక రచించారన్నారు. క్రీడాకారులను తయారు చేసేందుకు అన్ని రకాలుగా పోటీలు, ప్రత్యేక సాధనకు అవసరమైన స్టేడియాల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె.దినేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

లింగరాజు స్మారక పురస్కారం ప్రదానం



కృష్ణకుమార్‌ను సత్కరిస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే క్రొవ్విడి లింగరాజు జయంతి వేడుకల్లో భాగంగా సీనియర్ పాత్రికేయుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్‌కు క్రొవ్విడి లింగరాజు స్మారక స్ఫూర్తి పురస్కారం అందజేశారు. ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల భవనంలో శుక్రవారం సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సమితి గౌరవ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ పాత్రికేయ వృత్తికే కాకుండా నగరంలో అనేక విషయాల్లో తన వంతు పాత్ర పోషిస్తున్న కృష్ణకుమార్‌కు తగిన పురస్కారం లభించిందన్నారు. సీనియర్ సిటిజన్ సంస్థ గౌరవ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, క్రొవ్విడి లింగరాజు జయంతోత్సవ కమిటీ అధ్యక్షుడు రెబ్బాప్రగడ సత్యనారాయణ, సమితి కార్యదర్శి మాదిరాజు శ్రీనివాసు, రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

- నగరంలో వేగంగా డ్రైనేజీ పనులు
- గడపగడపకూ మన ప్రభుత్వంలో కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్



ప్రజలకు పథకాలను వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 10వ డివిజన్‌లో ఇన్‌చార్జి ఆరే చిన్ని, శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీల పునర్నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల, తెలకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, మాజీ కార్పొరేటర్ మానే దొరబాబు, పదో డివిజన్ నాయకులు గౌరీ శంకర్, వెన్నపు రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతు నగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి, సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన 16వ డివిజన్ ఆవ రోడ్డులోని రైతునగర్‌లో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించారు. గతంలో స్థానికులు ఆ 30 అడుగుల రోడ్డులో 15 అడుగులు డ్రైనేజీ తవ్వి, నిర్మాణం చేపట్టడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చందన్ నాగేశ్వర్‌కు విన్నవించారు. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక మహిళలు మాట్లాడుతూ డ్రైనేజీలో పది అడుగులు నీరు నిల్వ ఉండటం వల్ల అక్కడ తీవ్రమైన దుర్గంధంతో పాటు దోమలు పెరిగిపోయాయన్నారు. రైల్వే మెమో కార్‌షెడ్ గోడ పక్కన ఉన్న డ్రైనేజ్ మూసి వేయడం వల్ల ఆ మురుగునీరు బయటకు పోవటానికి దారి లేదన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఏఈ శ్రీధర్, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, రూపేష్ చంద్ర, ఈశ్వర్, జి.రమణ, అర్జున్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



అన్నపూర్ణమ్మపేటలో రేషన్ బియ్యం పట్టుకున్న ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్

కడియం/సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఆహార సలహా కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ పేర్కొన్నారు. పాఠశాలలను ఆధునీకరిస్తూ, మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆయన శుక్రవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జక్కంపూడి కిరణ్ అధికారులతో కలిసి కడియంలోని ఎస్సీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, దేవీ సెంటర్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, నిత్యావసరాలు, కోడిగుడ్లు, తదితర సరకుల వివరాల నమోదును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి కోడిగుడ్లు, ఇతర సరకులను మెనూ ప్రకారం నిర్ణీత కాలంలోనే చేరే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశించారు.

కడియం హైస్కూల్ సందర్శన

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అమలు చేస్తున్న పలు అంశాలను, లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక అన్నపూర్ణమ్మపేట రైల్వే గేట్ సమీపంలోని లక్ష్మి రైస్‌షాపును తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 1,265 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. అర్బన్ ఎంఎస్‌వో సమక్షంలో వారిపై 6 ఏ కేసు నమోదు చేసి, ఆ బియ్యాన్ని బొమ్మూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. డీఎస్‌వో పి.వి జయ భాస్కర్, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నాగజ్యోతి పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనను గమనించాలి

- తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలి
- ఎస్పీ జగదీష్



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: పిల్లల నడవడిక, ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సీసీఎల్‌కు (చైల్డ్ కాంక్లిట్‌విత్ లా), తల్లిదండ్రులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ పద్మావతి, జేజేబీ మెంబర్ తబిత, జేజేబీ హోమ్ కౌన్సిలర్ అభిషలోమ్ మాట్లాడుతూ పిల్లలు నేరాలు చేయకుండా, నేర ప్రవృత్తి అలవడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలు చెడు దారిలో ప్రయాణించేందుకు ముఖ్యంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కూడా కారణమన్నారు. తండ్రికి చెడు అలవాట్లు ఉంటే, వాటిని అనుసరించి పిల్లలు పాడైపోతున్నారన్నారు. చెడు వ్యసనాలు కలిగిన స్నేహితులతో కూడా పిల్లలు పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. క్రమశిక్షణ లేకుండా అడ్డదారిన వెళ్లి చిన్నారులు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. లగ్జరీ లైఫ్, బైకులు, స్మార్ట్ ఫోన్లు తదితర వాటికి అలవాటు పడి నేరప్రవృత్తిని పెంచుకుంటున్నారన్నారు. ఎక్కువగా పిల్లలు సీసీఎల్‌గా మారటానికి కారణం తల్లిదండ్రులు మరణించడం, తండ్రి మద్యపానం, తల్లి, తండ్రి అక్రమ సంబంధం కలిగి ఉండటం, కుటుంబ కలహాలు, సవతి తల్లి ప్రేమ, తల్లిదండ్రులు పనులకు వలసకు వెళ్లడం, స్మార్ట్ ఫోన్లు అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ పాల్, సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలతో శని, ఆదివారాల్లో సిటీ నియోజకవర్గంలోని 232 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థలో సంబంధిత బూత్ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తారన్నారు. కొత్తగా ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 31 మంది అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడు రోజులుగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో 31 మందిని అరెస్ట్ చేశారు. 595 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 3,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. నంబర్లు, రికార్డులు సరిగ్గా లేని 137 మోటారు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు రోజులుగా తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ లాఅండ్‌ఆర్డర్, ఎస్ఈబీ, స్పెషల్ పార్టీ అధికారులు, సిబ్బంది టీములుగా ఏర్పడి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమానిత ప్రాంతాలలో కార్డన్ సెర్చ్, సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా రెండు నెలల్లో 400 మంది బ్లేడ్ బ్యాచ్, రౌడీలను బైండోవర్ చేశామన్నారు. ఐదుగురిపై పీడీ యాక్ట్ అమలుపరిచామని, మరికొందరిపై అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదే క్రమంలో ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. సారా తయారీ, రవాణా, నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే.. వెంటనే పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, 100, 112కు సమాచారం అందించాలన్నారు. ఆపరేషన్‌లో సెంట్రల్ జోన్ డీఎస్పీ విజయ పాల్, ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్, సౌత్ జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొవ్వూరు సబ్ డివిజన్ డీఎస్పీ వర్మ తదితరులు పాల్గొన్నారు.